కథ

# అరసున్న

ఆవుల జయప్రద

'వెళ్లాలా? వద్దా?'

'వెళితే బావుంటుంది' ఆమె మనసు ఆశ పెడుతోంది.

'ఒంటరిగా? బహుశా నీవొక్కదానివేనేమో ఇలా ఏ తోడు లేకుండా, తన అంతరాత్మ నిరాశ పరుస్తోంది. ప్రియంవదకు ఉదయం నుంచి ఇదే మీమాంస. ఎటూ తేల్చుకోలేకపోతుంది.

ఇరవై ఐదేళ్లక్రితం పదిహేనేళ్ల వయసులో విడిపోయిన పాత స్నేహితులను కలుసుకోబోతున్న సంతోషాన్ని పూర్తిగా అనుభవించలేక, అలాగని మనసు మార్చుకుని దాని గురించి పట్టించుకోకుండా వుండలేకపోతుంది. నిండా ఆవహిస్తున్న అసంతృప్తే తనలో రాజ్యమేలుతుంది. ప్రియంవద తన ముందున్న అద్దంలో పూర్తిగా కనబడుతుంది. ఏ మార్పూలేదామెలో కట్టుబొట్టు హావభావాల విషయంలో వయసుకు తగినట్టు మార్చుకుంది కాని వయసు తాలూకూ ప్రభావం ముఖంలో గానీ ఆమె ఉత్సాహంలోగానీ మార్పు తేనేలేదు. నలభైకి దగ్గర వడుతున్నా ఒక్క వెంట్రుకూడా రంగుమారనే లేదు. ఆశ్చర్యమే.

కాని వయసు మాత్రం అప్పుడప్పుడు గుర్తుకొస్తూనే వుంది ప్రియంవదకు. వైశాఖంలో పలకరించి పోయే వానజల్లుల్లా.

"స్నేహితులంతా పిల్లల్ని, భార్యాభర్తల్ని వెంటేసుకొని వస్తారు. నీవు మాత్రం నలభైఏళ్లను వెనకేసుకున్నావ్. మనసుకు ఒకరిని జత చేసుకోలేక పోయావ్ అడవిలో మానుకు, నీకు తేడా ఏముంది? ఏ మొహంతో వెళతావ్?" వెనక నుంచి ఎవరో నిలదీస్తున్న ఇన్ఫీరియారిటి; ఇలాంటి సూటిపోటి మాటలకు బాగా అలవాటు పడింది. బాధపడి చేసేదేముంది? అందుకే బాధపడ్డం ఎప్పుడో మానేసింది. నిజమే ఎప్పుడూ వెక్కిరించే శూన్యం తప్ప పలకరించే దిక్కుండదు. తన చుట్టున్న పేరు, సంపద, ఉన్నతోద్యోగం, అన్నీ చూడ్డానికే తప్ప అనుభవించడానికి కాదు సముద్రంలో నీరులా ఏకాకిలా తను. "నీకేంటి తక్కువ ఎమ్.డి.వో గా చేస్తున్నావ్. నీ కింద పదిమంది గులామంటూ, కనీసం ఆ దర్పం, గాంభీర్యం చూపించుకోవటానికైనా వెళ్లిరావల్సిందే. వాళ్లందర్లోనూ నీస్థానమెవరికుంది? వీరసైనికుడిలా 15ఏళ్లుగా ఒంటరి జీవితాన్ని పాలిస్తున్నావ్. ఇప్పుడే వెఱపెందుకు? వగపెందుకు? లే, వెళ్దాం పదా!" ధైర్యం చెబుతున్నట్టుంది తనలోనే వేరెవరో. అంటే ప్రియంవదలో రెండు మనసులున్నాయా? ఇద్దరు మనుషులున్నారా! ఆలోచనలపై అధికారం తనదే.

× × ×

గేటుకిటూ అటూ పెద్ద కటౌట్. దానికి పూలదండలు వేసున్నాయి. 'కేవి-జెడ్.పి.హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక' అనే వాక్యం కిందే వాళ్ల టెన్త్ బ్యాచ్ సంవత్సరం వేశారు. సరిగ్గా ఆరోజుతో వాళ్ల పదోతరగతి పరీక్షలైపోయి అందరూ విడిపోయింది కూడా ఈ రోజే. భారీగా ఏర్పాట్లేమీ లేవుకానీ గేటునుంచి స్కూల్‌బిల్డింగ్ వరకు షామియానా వేశారు. కారు హారను విని ఎవరో పిల్లలు గేటు తీశారు. లోపల రంగుకాగితాలు మాత్రం కట్టారు. బహుశా ఎవరూ కార్లలో వచ్చినట్టులేరు. "డాబు" అనుకుంటారేమోనని మళ్లీ సంశయం. అందుకే కారును దూరంగా పార్క్ చేసింది.

స్కూల్ ప్రాంగణంలో అడుగు పెడుతుంటే ఎవరో బలవంతంగా లాగినట్టుంది. బలమంతా కూడదీసుకుని అడుగు ముందుకేసింది. తొలిచేస్తున్న ఆత్మన్యూనతను తొక్కేసే ప్రయత్నం చేస్తూ స్కూలు రూపురేఖలు బాగా మారిపోయాయి.

గేటునానుకొని బయటివైపు 2,3, పెద్ద చింతచెట్లుండేవి. అవి కొట్టేసి దిపెప్ అదనపు గదులు, ఎమ్.ఆర్.సి బిల్డింగ్ కట్టారు. ఆ మైదానం, ఆ జారుడుబల్ల, మర్రిచెట్టు ఊడలు అన్నీ అలాగే ఉన్నాయి. రావిచెట్టుకింద రచ్చబండ దానిమీద మొలిచిన పులిమేక ఆటకట్ట, దానిపక్కనే పాడుబడ్డ పాతబావి, దాన్ని మూసేశారు. కాని తుప్పుపట్టిన గిలక మాత్రం ఇంకా అలాగే వుంది. వాళ్లాడుకున్న దాగుడు మూతలకు సాక్ష్యంగా. ఆ మట్టిలోనే గుంతలు చేసి ఓమనగుంటలు ఆడింది, కట్టెపుల్లతో డబ్బాలు గీసి తొక్కుడు బిల్లాడింది, కొన్ని జ్ఞాపకాలు ఎన్నేళ్లైనా ఎంత తాజాగా వుంటాయి. ఆ స్తంభం చుట్టేసే కదూ

జతలాట ఆడుకుంది. గులకరాళ్లేరుకుని ఎప్పుడు అచ్చనికాయలు ఆడినా కరుణచేతిలో ఓడిపోయిందెవరు! తనే కదూ! అప్పుడు ఆ ఓటమి బాధించేది కాదు. ప్రాణ స్నేహితులు కదా! ఈ గేటు బయట ఒక ముస్లిమ్ అవ్వ చిన్న గంపలో తినుబండారాలు అమ్మేది. పావలావున్నా సరే వాళ్లిద్దరూ చెరిసగం తినాల్సిందే. ఇప్పుడా అవ్వలేదు. తన కూతురుంది వారసత్వం కాబోలు. అడవిలో దొరికే కలసపండ్లు, కదిరిపండ్లు ఏవేవో చిన్నచిన్న పళ్లు నోటినిండా పోసుకుని ఎవరు ముందోనని నములుతుంటే ఎంతరుచిగా వుండేదో. గుర్తుకు రాగానే నోట్లో నీళ్లూరాయి ప్రియంవదకు అసంకల్పిత ప్రతీకారచర్యగా.

ప్రియంవద తిరుగాడిన నేల, ఎగురుతూ గెంతుతూ బట్టలంతా దుమ్ముకొట్టుకున్న ఈ నేలను చూసి ఎన్నేళ్లైంది. అదే రంగు, అదే వాసన, మట్టి మారదుగా ముందుకు నడుస్తుంటే ఎల్లోఫ్రేం చెట్లు పూలు రాలుస్తూ స్వాగతం చెప్పాయి. ఎంతో అహ్లాదంగా వుంది ఆ నీడలో ఆ హాయిలో తేడా లేనేలేదు. ఎత్తులో మాత్రం వుంది. అప్పుడు దూరంనుంచి పరుగెత్తుకొచ్చి ఎగిరి మరీ అందుకునే వాళ్లు. కానిప్పుడు చేయిపైకెత్తితే తాకుతున్నాయి. ఆ పక్కనున్న బోరింగ్ దగ్గరే మధ్యాహ్నం అన్నం తిన్నాక చేతులు, టిఫిన్ బాక్సులు కడుక్కునే వాళ్లు. అది పోటీ అయినా కొట్లాటలా వుండేది. అందుకే బాక్సు చేతికి తగిలించాడని పవన్‌గాడి తలకు బొక్క వేసింది. వాడికి గుర్తుందో లేదో మరి.

వాళ్లింటి నుంచి స్కూల్‌కు రావాలంటే దాదాపు ఒకటిన్నర కి.మీ నడవాల్సి వచ్చేది. కానిప్పుడు స్కూల్‌దాకా ఇల్లు నడిచొచ్చాయి. భౌతికంగా పరిసరాల్లో భారీగానే మార్పులొచ్చాయి. వాళ్లు కూర్చున్న అదే క్లాస్ రూం, అదే సైన్సు ల్యాబ్, వాళ్లు పిచ్చిగీతలు గీసిన అవే బ్లాక్‌బోర్డ్స్, అవే గోడలు అన్నీ అలాగే వున్నాయి. స్కూల్ స్టూడెంట్ ఆనర్ బోర్డుమీద ప్రియంవద పేరు అలాగే వుంది. ఆ తాలూకాలో తనే టాపర్ అప్పట్లో. అత్యధిక మార్కులు సాధించినందుకుగాను తన పేరు పెయింట్‌తో వ్రాసి ఎదురుగా మార్కులు వేశారు. అది ఎప్పటికీ అలాగే వుంటుంది. నిన్నో మొన్నో జరిగినట్టుంది తనకు కాని ఎంత సుదీర్ఘకాలం. గుర్తుకొస్తుంటే మనసు పులకించి పోయింది. కొన్ని జ్ఞాపకాలు ఎంత ఆర్ధ్రతగా వుంటాయో! స్కూలంతా కలియజూస్తూ తన్ను తానే మర్చిపోయింది.

అప్పటివాళ్ల గురువులందరినీ పిలిచినట్టున్నారు. వేదికను ఇంకా అలంకరించే పనిలోనే వున్నారు. బహుశా ఆ పనిలో నిమగ్నమైన జెంటిల్‌మేన్ అంతా తన క్లాస్‌మేట్సే. వేదిక కింద వేసిన కుర్చీల్లో మేడమ్‌గార్లంతా ఆసీనులై తెగ కబుర్లలో మునిగిపోయారు. వాళ్లలో మేస్టార్ల సతీమణులు కూడా వున్నట్టున్నారు. ముఖ్యంగా కొందరి భర్తలు, కొందరి భార్యలు, పది పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలూ వున్నారు. అందరూ ప్రపంచాన్ని మర్చిపోయి వేరేదో లోకంలో విహరిస్తున్నంత ఆనందంతో నవ్వులతో వాళ్ల ముఖాలు వెలిగిపోతున్నాయి. తల్లిదండ్రులు స్నేహితులైతే పిల్లలంతా కలవకుండా ఎలా వుంటారు. వాళ్లప్పుడే ఆటల్లో పడిపోయి చాలా సేపయిందని తెలుస్తుంది. ఇదంతా దూరంనుంచి చూస్తున్న ప్రియంవదను ఎవరూ గమనించలేదు. ఎవరూ ఎదురొచ్చి స్వాగతించలేదు. తనకు కొంత చిన్నతనంగా అనిపించింది.

“ఇది నీ ఆఫీసు కాదు, నీకు రాచమర్యాదలు చేయటానికి అధికార దర్పం పక్కన పెట్టి వెళ్లి అందర్లో కలిసిపో, నిన్నెవ్వరూ ఏమీ అనుకోరు” మనసు శాసించింది ప్రియంవదకు మొహమాటం తటపటాయించింది.

ప్రియంవద కళ్లు మూశారు ఎవరో వెనుకనుంచి అదే అప్పట్లో అయితే ఠకీమని చెప్పుకొనే వాళ్లు. ఇరవై ఐదేళ్ల క్రితం నాటి స్పర్శ. తను గుర్తుకు తెచ్చుకొనే లోగానే మళ్లీ చేతులు మారాయి. చెప్పడం కష్టమే. వరుసగా అన్ని పేర్లు చెప్పింది. వాళ్ల బ్యాచ్‌లో ఆడపిల్లలుండింది కేవలం ఎనిమిదిమందే అందుకే బాగా గుర్తు. అబ్బాయిలైతే దాదాపు పాతిక దాకా వున్నారు. ఐదారు పేర్లు తప్ప ఏమీ గుర్తు లేవు. కాని ముఖాలు స్ఫురణలోనే వున్నాయి. అదీ వచ్చేముందు వాళ్ల గ్రూప్ ఫోటో వెంట తెచ్చుకుంది.




అక్టోబర్ 25, 2009న విజయనగరం, గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరిగిన విజయభావనా సాహితీ మిత్ర సమాఖ్యవారు నిర్వహించిన సభలో పాల్గొన్న చినుకు అసోసియేట్ ఎడిటర్ జనార్థన్ లంకె, గోపీచంద్ నవలలపై ప్రధానవక్తగా ప్రసంగించిన చినుకు మాసపత్రిక ఎడిటర్ నండూరి రాజగోపాల్, విజయనగరం మున్సిపల్ ఛైర్మన్ ఎ. సూరిబాబు, ప్రముఖ న్యాయవాది కె. కృష్ణమూర్తి.

సునీత, ఉష, పద్దు, అపర్ణ, శైలజ, ధన అందరూ చుట్టూ నిలబడే వున్నారు. దుఃఖమో, ఆనందమో, ఉద్వేగమో అన్నీ కలగలిసి వచ్చాయో తెలియదుగానీ ఒక్కసారిగా అందరూ ఒకే గుంపుగా కౌగిలించుకున్నారు. అందరి కళ్లలోనూ నీళ్లు ఉప్పగా కారుతూనే వున్నాయి. ఒకరి చేతులు మరొకరి కళ్లను తుడిచే ప్రయత్నంలో బిజీగా వున్నాయి. వాళ్లందరి ముఖాల్లోనూ ఒకటే ఫీలింగ్... ఇన్నేళ్లు కలుసుకోకుండా ఎలా వుండగలిగాం అని.

అవును నిజమే ఎలా వున్నారు. మిగతా అందరి కంటే సంసారం, పిల్లల బరువులు, బాధ్యతలూ అంటూ మర్చిపోయుంటారు. మరి తనకేముంది? రాత్రిళ్లలో రహదారిలా ఒంటరిదేగా, కనీసం తనైనా ఆ స్నేహాన్ని కొనసాగించాల్సింది! ప్చ్....

“పెళ్లి పిల్లలంటేనే జీవితమా? వృత్తిపరమైన బాధ్యతల్లేవా? అది జీవితం కాదా? వీళ్లంతా కుటుంబాల సేవకే పరిమితం. మరి నీవో వుద్యోగిగా ప్రభుత్వానికెంత సేవ చేస్తున్నావ్. నువ్వే గొప్ప” ప్రియంవదలో ఎవరో భుజం తడుతున్నారు.

ఆలోచనలు మానేసిన ప్రియంవద కళ్ళు దేన్నో ఆత్రంగా వెదుకుతున్నాయి. గమనించిన శైల అడిగేసింది. ‘ఇంక దేనికోసం తన ప్రాణం కోసమే అయుంటుంది’. అంది ఓరగా చూస్తూ ఉష.

‘ఏయ్ కరుణ, ఎవరొచ్చారో చూడు’ అంటూ చప్పట్లు కొట్టి పిలిచింది. ప్రియంవదను చూపిస్తూ. దూరంగా కూర్చున్న కరుణ అరనవ్వు నవ్వి తనకొడుకు ఫుల్ షర్టును మోచేతుల దాకా మడిచే పనిలో బిజీ అయ్యింది. ఒక్కవుదుటున పరిగెత్తు కొచ్చి అమాంతం చుట్టేస్తుందనుకుంది. ఆనందంతో ఉక్కిరి బిక్కిరౌతుందని మురిసిపోయింది. వెనుకటి జ్ఞాపకాల నెమరులో కాలాన్నే మర్చిపోతారనుకొంది ప్రియంవద. కరుణ మళ్లీచూడనైనా లేదు. ప్రియంవద బాగా ఫీలైంది, ఏదోలా అనిపించింది తనకు. ‘కరుణ బాగా మారిపోయింది తెలుసా?’ అంది అపర్ణ. కరుణ అలాంటిది కాదే. తనెప్పటికీ మారదు. అప్పట్లో వాళ్ల స్నేహం వైపు

ఎవరూ తొంగి చూసేవారు కూడా కాదు. ఇక ఛేధించేదెవరు? మగవారి స్నేహానికైతే శ్రీకృష్ణుడు-కుచేలుడు, కర్ణుడు-ధుర్యోధనుడు, ఇప్పట్లో అయితే వై.ఎస్.ఆర్, కె.వి.పి లను ఉదాహరణగా చూపిస్తారు మరి. స్త్రీల స్నేహానికి! అంటే చరిత్రలో నిలిచిపోయే ఆడ స్నేహితులే లేరా! ఎంత ఘోరం!

దాదాపు డిగ్రీ అయిపోయే దాకా వాళ్లస్నేహం కొనసాగింది.గ్రూప్స్ వేరైనా కలుసుకునే వాళ్లు ఆ సమయంలోనే కరుణ ప్రేమ కావ్యంలో ప్రియంవద రాయబారిగా మారి వాళ్ల నాన్న, వీళ్ల నాన్నతో తిట్లు తినాల్సి వచ్చింది. ఎంతైనా ఫ్రెండ్ కదా! విషయం తెలిసిన వాళ్లనాన్న ఓ సివిల్ సర్వెంట్ కిచ్చి పెళ్లి చేశాడు. అతని వుద్యోగరీత్యా రాష్ట్రాంతరం వెళ్లిపోయింది. ఆ తర్వాత కూడా వాళ్ల మధ్య తోకలేని పిట్టలు చాలానే రాకపోకలు సాగించాయి. కాలక్రమంలో తగ్గిపోయి, ఇప్పుడిలా పూర్తిగా ఎడమయ్యారు. ఇద్దరు మగపిల్లలు తనకిప్పుడు. ఆర్థిక పరమైన తేడా బాగా చూపిస్తుంది. స్నేహానికంటే కూడా డిగ్నిటికి బాగా విలువిస్తుందని అర్థమైన ప్రియంవద కూడా చొరవ చూపించలేకపోయింది. అసూయో ఏమో చెప్పలేంగానీ తనూ దూరంగానే వుండిపోయింది. అన్నేళ్ల మౌనాన్ని ఎవరు మాటలతో కడిగేస్తారు?!

యవ్వనం మలిదశలో వున్నారుకదా! దాదాపు అందరి శరీరాకృతుల్లోనూ పెను మార్పులొచ్చాయి.

"ఏంటే అమృతం తాగుతున్నావా? అప్పుడెలాగున్నావో ఇప్పుడూ అలాగే వున్నావు. చిన్నప్పుడు యూనిఫాంలో అల్లరి దాగుంటే ఇప్పుడు చీరలో హుందాతనముంది. అంతే తేడా!" రెండు బుగ్గలు పిండేస్తూ అడిగింది ధన. చెంపలు ఎరుపెక్కాయి సిగ్గుతో ప్రియంవదకు.

"ప్రపంచంలో ఎనిమిదో వింత కావాలనుకుందేమో తిండి తినటం మానేసి జీరో సైజు మెయింటైన్ చేస్తుంది". తడుముతూ అంది షబానా. ప్రియంవదకు ఒకింత గర్వంగా వుంది.


"అన్నీ బాగానే వున్నాయి కానీ! పెళ్లి చేసుకునేదుందా! లేదా, ఇప్పటికే చాలా ఆలస్యమైంది, ఇంకొన్ని రోజులాగితే చేసుకున్నా వేస్ట్ మేం చూడు సగం ముసలోల్లమయ్యాం. నువ్వేంటింకా చిన్నపిల్లలా..?" అనే వెర్షన్‌ను శైల, సునిత, ఉష కలిసి పూర్తిచేశారు. ప్రియంవద గర్వం ఎవరో సైపుతో పీల్చేసినట్టుంది. మారిన కవళికలను ఎవరూ చూడకుండా జాగ్రత్త పడింది.

అలంకరణ ముగించి వచ్చిన అబ్బాయిలంతా(ఇప్పుడు జెంటిల్‌మేనే కదా) వీళ్లతోపాటు కబుర్లలో మునిగిపోయే ముందు వరుసగా పేర్లు చెప్పమన్నారు. కొంత ఇబ్బంది పడింది తను. గుర్తున్నవన్నీ చెప్పింది. "ఫర్వాలేదు మమ్మల్ని కూడా గుర్తుంచుకున్నారే, చాలా thanks అన్నారంతా ముక్తసరిగా.

"అసలు మీరొస్తారనుకోలేదు మేడం" అన్నాడు శ్రీను. మేడమేంటి, నేను మీ చిన్ననాటి ప్రియంవదనే కాదా అనుమానంగా అడిగింది. "ఎంత స్నేహితులమైనా మీరు మా అందరికంటే ఉన్నత స్థానంలో వున్నారు. మిమ్మల్ని గౌరవించడం మా భాధ్యత" వినయంగా అన్నాడు ఖాదర్ బాషా. ఎంతగా మారిపోయాడు. అప్పుడైతే మధ్యాహ్నం సైన్సు ల్యాబ్‌లో గోడకానుకొని నిద్రపోయేవాడు. అది చూపించి సైన్సు మాస్టారుతో తన్నించింది. నిక్కరు తడిపేసుకున్నాడు. అది మొదలు వాడు నిద్రపోతే ఒట్టు. కాని అసలు కారణం వేరు. ఉష వాడిపై హీరోవర్షిప్ పెంచుకుంది. ఆ విషయం ప్రియంవదతో చెప్పింది. కాని మీరేమో ఆ పిల్ల నల్లగా వుందని 'ఆ' అమ్మాయిని చూడనైనా చూడకుండా 'నో' చెప్పాడు. ఆ కసి అలా తీర్చుకుంది. ఆ విషయం ఇద్దరికీ ఒకేసారి గుర్తొచ్చి ఫక్కున నవ్వుకున్నారు.

వీడెవడో తెలుసా మీ అమ్మాయిలంతా కలిసి కొండచిలువని పేరువాడే ఈ పరమేశ్వర్ అన్నాడు. వాడి భుజంపై తడుతూ.

ప్రియంవదకు గుర్తొచ్చింది. వాడప్పుడు క్లాస్‌లో అందరికంటే పెద్దగా వుండేవాడు. అమ్మాయిల్ని కళ్లతోనే భయపెట్టేవాడు. అందుకే వాడికాపేరు. ఇదుగో వీడు గుర్తున్నాడా శ్రీధర్ అప్పుడోసారి మిమ్మల్ని చెప్పుల అంగడిలో చూసి




పలకరించాట్టగా అన్నాడు. పవన్ పిలకను సరిచేసుకుంటూ ఓ రోజు ఫుట్‌వేర్ షాపులో శ్రీధర్ ప్రియంవదను చూసి తనంతకు తానే పరిచయం చేసుకున్నాడు. చాలా సేపటిదాకా ప్రియంవదకు గుర్తు రానేలేదు. "ఏ వుద్యోగం దొరక్క ఈ షాపులో చేస్తున్నాను. ఇద్దరు పిల్లలు ఆర్థిక పరిస్థితి బాగోలేదని" చెప్పాడు. ఆ స్థితిలో కూడా అంతరాలు మరచి స్నేహం ముందేది దాచుకోకుండా అన్నీ చెప్పాడు.

చేతిసాయం చేద్దామంటే చిన్న బుచ్చుకుంటాడేమోనని, అలాగ వూరికే రావటానికి మనసొప్పలేదు ప్రియంవదకు. నిట్టూర్చడం తప్ప ఏమీ చేయలేకపోయింది.

'ఇప్పుడు కూడా మనందరం కలుసుకునే మహత్తరమైన ఆలోచన శ్రీధర్‌దే తెలుసా' అన్నాడు పురుషోత్తం. అభినందించకుండా వుండలేకపోయింది ప్రియంవద.

వాళ్ళ మలి పరిచయాలు నిండా మునిగిన కబుర్లలోంచి తేరుకున్నాక గురువులంతా ఒక్కొక్కరే రావటం మొదలు పెట్టారు. అందరూ ఇంచుమించు ఒకే వయసు వారు కావటంతో అందరూ ఒంగిపోయారు. కొందరు జంటలుగా, ఇంకొందరు వియోగులుగా వచ్చారు. రామిరెడ్డి హెడ్మాస్టరుగారు కాలం చేశార్ట. అందరికీ బాధ కలిగించిందావిషయం. అప్పట్లో వాళ్లకు ఇంగ్లీషు చెప్పేవారు. ప్రియంవద అంటే ఆయనకు విపరీతమైన అభిమానం, వాత్సల్యం. అందరూ ఒకెత్తు, ఆ అమ్మాయొక్కత్తే ఒకెత్తు మాస్టార్లందరి దృష్టిలో. "నేను ఇంటికెళ్లినా, స్కూల్ పరిసరాలే గుర్తొస్తాయి. మీరందరూ బాగా చదివితే ఆ అమ్మాయిలాగే మీరు గుర్తొస్తార్రా..." అని పదే పదే చెప్పేవారు. ఇప్పుడు ప్రియంవదను ఈ స్థాయిలో చూసుంటే ఎంత సంతోషించేవారో. లెక్కల మాస్టార్లు, సైన్సు, ఇంగ్లీషు, తెలుగు మాస్టార్లు మిగతా అందరు వేదికపై కూర్చున్నారు. జ్ఞాపకాలన్నీ కలగాపులగంగా గుర్తొస్తున్నాయి. జ్ఞాపకాల సొరుగుకు కన్నం వేశారెవరో ఈ ఆత్మీయులు ఈ రోజు.

విద్యార్థులు వరుసగా పాదాభివందనం చేస్తూ పోయారు. ఆ రోజు పరీక్షల ముందు సరస్వతీ పూజరోజు కూడా ఇలాగే ఆశీర్వాదం తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు వణుకుతున్న మెడలతో, ఒకప్పుడు దండించిన చేతులే ఇప్పుడు

ఆప్యాయంగా తలలు నిమురుతుంటే వాళ్లంతా అన్నీ మర్చిపోయి ఒక్కసారిగా బాల్యంలోకి పారిపోయినట్టుంది. అప్పుడూ ఇప్పుడూ వాళ్లకుంది ప్రేమేనని తెలిపారు. వెచ్చని కన్నీళ్లతో. నిజంగా బాల్యంలోవున్న ఆనందం అప్పుడు తెలిసేది కాదు. కానివ్వుడు అదే కావాలనివిస్తుంది. మళ్లీ తిరిగొచ్చేదేనా? తాత్కాలికంగా సుఖం, దుఃఖం, ఒంటరితనం అన్నిటినీ మర్చిపోయి కొద్దిసేపయింది. అంతలోనే ఏమ్మా ఒంటరిగా వచ్చావ్, భర్త పిల్లలు...? మధ్యలో ఆపేశాడు లెక్కల మాస్టారు తన దగ్గర కూర్చోబెట్టుకుంటూ ప్రియంవద అంటే మొదటి నుంచీ అభిమానమెక్కువే. డ్రిల్లింగ్ మిషన్‌తో గుండెను తొలచినట్టనిపించిందామెకు.

"పెళ్లి చేసుకోలేదు మాస్టారు" ఇబ్బంది కనిపించకుండా తల దించుకుని చెప్పింది. ఎవరూ కెలకని ప్రశ్నేమీ కాదు, కాని సమాధానం ఏం చెప్పాలి! ఎవరు చెప్పాలి?

"ఏమ్మా ఎందుకు? వయసుపోతే మళ్లీ రాదు తల్లీ, ఆలస్యమైనా పర్వాలేదు, పెళ్లిచేసుకో, ఒంటరిగా వుంటే అరసున్నాలా వుంటుంది తోడొకరుంటే వృత్తంలా పరిపూర్ణమౌతుంది జీవితం" లెక్కల భాషలో అమ్మగా ఆవేదనను, నాన్నలా సలహాను ఇస్తూ తలమీద చేయివేశాడు.

తనలోని ధైర్యం మొండితనం కరిగి వెళ్లేదారిలేక నీలాలై కారాయికళ్లగుండా. ఎప్పుడూ తనకు తాను వేసుకోని ప్రశ్న. "నేనెందుకు పెళ్లి చేసుకోలేదు?"

ఇరవై ఏళ్లలో కౌమారం వెళ్లిపోతూ యవ్వనం వాకిట్లో తోసేసింది. అల్లరి చిలిపితనం ఛాయలింకా వీడిపోని వయసులోనే ఉద్యోగం కొత్త బాధ్యతలు నెత్తికెత్తింది. ఉద్యోగంలో స్థిరత్వం సాధించటానికి మూడేళ్లు పట్టింది. 'సంపాదిస్తుందిగా ఎవరైనా చేసుకోకపోరు' అన్నవాళ్ల నాన్న ధీమా తప్పని త్వరలోనే తెలిసింది. సంబంధాలు చూట్టం మొదలయ్యే సరికి పాతికేళ్లు నిండాయి. పాతికేళ్లన్నా పెళ్లెందుకాలస్యం అవుతుందోనన్న ఆలోచనల మిస్టరీ వీడేసరికి మరో ఐదేళ్లు జతకలిసాయి. కానీ జీవిత ప్రయాణంలో మాత్రం ఎవ్వరూ తోడు కాలేదు. లేక లేక మనసుపడినవాడు పిరికివాడై తనకు దూరంగా పారిపోయాడు. డబ్బుతో దేన్నైనా కొనగలం కాని ప్రేమను, ఆప్యాయతను బంధాల్ని, అనుబంధాల్ని కొనగలరా? ఆ తర్వాత వాడివల్లా సంబంధాలు రావడం మానేశాయి. అంతే పెద్దగా చెప్పుకోదగ్గ కారణాలేవీ లేవు కానీ జీవితం మాత్రం వ్యర్థమైపోయింది ఎందుకు? వృత్తిపరంగా, ఆర్థికంగా అన్ని విధాల అభివృద్ధి చెందింది. కానీ సామాజికంగా కుటుంబపరంగా ఒంటరిదానిగా మిగిలిపోయింది. ఇక ఇప్పుడు ఆ ఆలోచనే లేదు. ఇందులో తప్పెవరిది? బాధ్యులెవరు?

కానీ శిక్షమాత్రం తనే అనుభవిస్తుంది.

"వూరుకోనాన్నా ఎంత ఏడ్చినా కాలం తిరిగిరాదు. నీవనుకున్న లక్ష్యంవైపు ధైర్యంగా అడుగెయ్యి. నీ ఆశయసాధనలో నేనెప్పుడూ తోడుంటాను. పదిమందికి ఉపయోగపడితే


చదవండి! చదివించండి! చందాదారులు కండి!

**చినుకు మాసపత్రిక**

| | | | | |
|---|---|---|---|---|
| సంవత్సర చందా | (వ్యక్తులకు) | : | రూ. | 120/- |
| సంవత్సర చందా | (సంస్థలకు) | : | రూ. | 150/- |
| 3 సంవత్సరాల చందా | (వ్యక్తులకు) | : | రూ. | 330/- |
| 3 సంవత్సర చందా | (సంస్థలకు) | : | రూ. | 420/- |
| 5 సంవత్సరాల చందా | | : | రూ. | 500/- |
| 10 సంవత్సరాల చందా | | : | రూ. | 1,000/- |
| విశిష్ట సభ్యత్వం | | : | రూ. | 3,000/- |
| U.S.A | | : | | 25$ |


## రైతు నానీలు

మేరెడ్డి యాదగిరిరెడ్డి

బాయినిండా నీళ్ళు
నెర్రె బాసిన పొలం
ఓ అదా!
వుచిత కరెంటు

ప్రాజెక్టులు
రైతు భూములు మునక
కంట్రాక్టర్లకు
డబ్బుల వరద

ఈయేడు పంట
బాగానే పండిందిగాని
దళారి ఇంట
సిరులు కురిపించింది

కల్లం నిండా వడ్లు
కల్లం చుట్టూ అప్పులవాల్లు
అన్నదాత ఇంట్లో
ఆకలి కేకలు

జలయజ్ఞం
కోట్లు కంట్రాక్టర్లకు
లక్ష క్యూసెక్కుల నీళ్ళు
సముద్రం పాలు

జీవితానికదే సార్థకత. అరసున్నా కూడా ఒక అక్షరమే, దానికీ అర్థముంది నాన్నా!" అమ్మ అదృశ్య హస్తమై కన్నీళ్లు తుడిచింది. ఆమె శక్తి రహస్యం వాళ్ల అమ్మే అంటూ మాట్లాడుతున్నారు. ఎవరికి గుర్తొచ్చిన సంఘటనలను వారు మర్చిపోలేని అనుభూతులుగా మలచి చెప్పుకుపోతున్నారు.

'ఈ కార్యక్రమం వెనుక వుద్దేశ్యమేమిటో'నని అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇంతలోనే శ్రీధర్ వంతు రానే వచ్చింది. కార్యక్రమ రూపశిల్పి అతనే కదా, ఆంతర్యమేమిటో? అందరితో పాటు ప్రియంవదకు ఇంట్రస్ట్ పెరిగింది. ఎందుకంటే శ్రీధర్ ఫస్ట్‌క్రష్ తనేనంట. అప్పుడు భయపడి చెప్పలేదుట. అయినా ఆ వయసులో పెదవి దాటని ప్రేమలే ఎక్కువ. అదే ఇప్పుడు మాటల మధ్యన జాన్ చెబితే తెలిసింది. ఇప్పుడిలా చూస్తుంటే తనకూ బాధగానే వుంది. అయినా తనపట్ల అలాంటి ఫీలింగా? తెలిసి ఆమెకే ఆశ్చర్యం.

"ఎంతో విలువైన మీ అందరి సమయాన్ని ఈ ఒక్కరోజు నేను వృథాచేసినందుకు మన్నించండి. కానీ ఈ ఒక్కరోజు నా కొడుకు జీవితంలో బ్రతుకంతా సరిపడా వెలుగునిస్తుందని ఆశిస్తున్నాను. వాడికి పుట్టుకతోనే గుండె జబ్బు. వయసుతోపాటు గుండెలో రంధ్రం కూడా పెరిగి పెద్దదైంది. చూపించిన ప్రతీ డాక్టరు ఆపరేషన్ తప్ప మరో మార్గం లేదన్నారు. దినసరి తిండికే కష్టపడే నాకు లక్షలతో కూడిన వైద్యం చేయించే స్థోమత లేదు. ఎవరి ముందు చేయిచాచలేక, వేరే దారి కనిపించక మీ అందరి సహాయం కోరాలనే నా స్వార్థంతోనే ఈ మహత్తర కార్యక్రమాన్ని వేదికగా చేసుకొన్నాను. తప్పైతే నన్ను క్షమించండి"...

మోకాళ్ల మీద నిలబడి చేతులు జోడించి తలదించుకున్నాడు. చెమ్మగిల్లని కళ్లు లేనే లేవు అక్కడి వాళ్లలో.

స్పందించే హృదయం తనకే వుందంటూ కరుణ ఐదువేలిచ్చింది. తనకంటే గొప్పవాళ్ళు లేరన్న ఫీలింగ్ ముఖంలో ప్రస్ఫుటంగా తెలియజేస్తూ వెళ్లిపోయింది. ముందుగానే. అంతే కొన్ని నిజాలెప్పటికీ కొందరికి తెలియవు. తలా ఓ చేయి వేశారు. రిటైరైన మాస్టార్లంతా కూడా ఫెన్షన్‌లోంచి కొంతమొత్తమిచ్చారు. ఫ్రెండ్సంతా తన వైపు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆమె పట్ల వాళ్లకు ఎక్స్‌పెక్టేషన్ ఎలా వున్నాయో వూహించుకోగలదు. ఎంతోకొంతిచ్చి తనూ వెళ్లిపోతే వాళ్లకూ తనకు తేడా ఏముంటుంది?

మిగతా సహాయమంతా తనే చేయాలని నిర్ణయించుకొని శ్రీధర్‌కు మాటిచ్చింది. అందరి మెచ్చుకోలు కోసం కాదు. తన లక్ష్యసాధనకు మొదటి అడుగు ఇక్కడే మొదలౌతుందని అర్థమైంది.

అందాకా రాఘవయ్య మాస్టారు కన్నీళ్లు పెట్టుకోవడం కూడా తనను కలచివేసింది. అతనికిద్దరబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు అందరూ మంచి పొజిషన్లోనే వున్నారు. కానీ వాళ్లెవ్వరూ పట్టించుకోవట్లేదట. ఈ ప్రాయంలో వాళ్లు ఒంటరిగా ఎలా వుంటారు? వేణుగోపాల్ మాస్టారు భార్య చనిపోవడంతో ఒక్కరే వుంటున్నార్ట. ఆ వయసు వారి జీవన సంధ్య సశేషాలన్నీ ఇంచుమించు ఒకేలా వుంటాయేమో! అలాంటి వాళ్లందరికీ బాసటగా నిలబడాలనే ఆమె ఆశయసౌధం అమ్మ పేరు మీద కళ్లలో కదలాడింది.

దాని బాగోగులు చూసుకోవాల్సింది వేరెవరో కాదు. శ్రీధర్ అతని కుటుంబమే. అందులో ఉండబోయేది వేరెవరో కాదు. వాళ్లకు అక్షర జ్ఞానం ప్రసాదించి వెలుగుదారులు చూపించిన గురువులు. అంతేకాదు ఒంటరితనంతో బాధపడే ప్రతీ ఒక్కరికది విడిది. జీవితంలో అలసిపోయిన వాళ్లందరి చివరి మజిలి అదే కావాలి. అరసున్న లాంటి జీవితాల ఆశ్రయమే ఆ ఆశ్రమం. దానికి పునాదులుఇప్పుడే ఇక్కడే మదిలో మొదలయ్యాయి. అది ఆమె పేరుకో ప్రతిష్టకో చేయడం లేదు. ఒంటరి జీవితాలకు అర్థం తెలిపేలా, పరమార్థం గూడుకట్టుకునేలా, ఒంటరిగా వున్నా అర్థవంతమైన బ్రతుకులుంటాయని నిరూపించడానికే.

నిస్సహాయులను వెంటబెట్టుకొని, ఆశాజ్యోతిలా ధైర్యంగా ముందుకు నడిచింది ప్రియంవద. ఆరిపోతున్న దీపాలకు ప్రేమతైలం పోసి వెలిగించాలని రెండు అరచేతులు అడ్డంపెట్టి కాపాడాలని.

ఒంటరితనం మనిషికి బ్రతికేందుకు కావాల్సిన ధైర్యాన్నిస్తుంది. మొండితనం అలుపెరుగని శక్తినిస్తుంది.

"గుడ్ అనుకున్నది సాధించబోతున్నావ్" తనలో తననే ఎవరో మెచ్చుకొని తట్టారు.




224 పేజీలతో
80 మంది ప్రముఖ రచయితలతో,
మల్లాది వెంకట కృష్ణమూర్తి
సెంటర్‌స్ప్రెడ్‌తో 'చినుకు'
నాలుగవ వార్షిక ప్రత్యేక సంచిక
వెల రు.35/- (పోస్టేజితో సహా).
కావలసినవారు ఎం.ఓ. ద్వారా 'చినుకు'
కార్యాలయానికి పంపించగలరు.

చినుకు మాసపత్రిక, దత్తాస్ నయాబజార్,
రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
☎ 0866-6640595, E-mail :
editor_chinuku@yahoo.com



190 పేజీలతో
ప్రముఖ రచయితలతో,
చినుకు మూడవ వార్షిక ప్రత్యేక సంచిక
వెల రు.35/- (పోస్టేజితో సహా).
కావలసినవారు ఎం.ఓ. ద్వారా 'చినుకు'
కార్యాలయానికి పంపించగలరు.

చినుకు మాసపత్రిక, దత్తాస్ నయాబజార్,
రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
Phone: 0866-6640595, E-mail :
editor_chinuku@yahoo.com